నమస్తే తెలంగాణ
నిజామాబాద్
3 | నిజామాబాద్, గురువారం 9 మే 2024 | NIZAMABAD

మెండోరా మండలం దూదిగాం గ్రామంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి. పక్కన బాజిరెడ్డి గోవర్ధన్

గ్యారెంటీలపై కాంగ్రెస్‌ను నిలదీయండి

ప్రజల్లో ఉండే బాజిరెడ్డిని గెలిపించండి

- హామీలు అమలు చేయని బీజేపీ, కాంగ్రెస్‌కు సురుకు పెడదాం
- మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి
- పార్లమెంట్‌కు పంపిస్తే ప్రజల కోసం కొట్లాడుతా: బాజిరెడ్డి గోవర్ధన్

ఏర్గట్ల/ముప్కాల్, మే 8 : అసెంబ్లీ ఎన్నికల్లో దొంగ హామీలిచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఆ పార్టీ నాయకులు ప్రస్తుతం ప్రచారం కోసం వచ్చినప్పుడు ఆరు గ్యారెంటీల అమలుపై నిలదీయాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి జనంలోనే లేరని, రైతులను మోసం చేసి గెలిచిన అర్వింద్ ఐదేండ్లల్లో ఒక్క గ్రామంలోనైనా అభివృద్ధి పనులు చేపట్టిన దాఖలాలు లేవన్నారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు అభివృద్ధి పనుల కోసం ఇచ్చిన ప్రొసీడింగ్ కాపీలన్నీ బోగస్ అంటూ కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కలెక్టరేట్‌కు వెళ్లి అవి బోగస్ అని నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. ఏర్గట్ల, ముప్కాల్ మండల కేంద్రాలతోపాటు మెండోరా మండలం దూదిగాం గ్రామంలో బీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌తో కలిసి బుధవారం రోడ్‌షో, ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేముల మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి ఝూటా సీఎం అని అన్నారు. వంద రోజుల్లో ఇస్తామన్న హామీలను 150రోజులైనా అమలు చేయకుండానే మరోసారి లోక్‌సభ ఎన్నికల సందర్భంగా అబద్ధాలు మాట్లాడుతున్నాడని ధ్వజమెత్తారు. గత ఎన్నికల్లో ఐదు రోజుల్లో పసుపు బోర్డు తెస్తానన్న అర్వింద్ ఐదేండ్లు గడిచినా తీసుకురాలేదన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు ప్రజలు ఓట్లతో సురుకులు పెట్టాలన్నారు. బాల్కొండ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, కుల సంఘాలకు మంజూరు చేసిన నిధులను గుర్తుచేశారు. అప్పుడు మంజూరు చేసిన పనులను పూర్తి చేసేలా వీడీసీలు కాంగ్రెస్ నాయకులపై ఒత్తిడి తేవాలని కోరారు. జిల్లా ప్రజల సమస్యల పరిష్కారం కోసం కొట్లాడి నిధులను తెచ్చేందుకు లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటువేసి బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. అప్పటి సీఎం కేసీఆర్‌ను ఒప్పించి ఏర్గట్లను మండలకేంద్రంగా మార్చడంతోపాటు కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టి రూపురేఖలను పూర్తిగా మార్చానని అన్నారు. ముప్కాల్, మెండోరా మండలాలను అభివృద్ధి చేసిన తీరును వేముల వివరించారు.

ఏర్గట్లలో మాట్లాడుతూ కారు గుర్తుకు ఓటు వేయాలని నమూనా బ్యాలెట్‌ను చూపుతున్న ప్రశాంత్‌రెడ్డి, బాజిరెడ్డి

ప్రశ్నించే గొంతుకనవుతా : బాజిరెడ్డి

తనను గెలిపించి పార్లమెంటుకు పంపిస్తే ప్రజల తరపున ప్రశ్నించే గొంతుకనవుతానని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. జిల్లా అభివృద్ధి, న్యాయంగా రావాల్సిన నిధులు, రైతు సమస్యలపై పోరాటం చేస్తానని హామీ ఇచ్చారు. దేవుళ్ల మీద ఒట్లు, గుడుల పేరు మీద ఓట్లు అడిగేవారిని నమ్మొద్దని కోరారు. అంతకుముందు ఆయా గ్రామాల్లో రోడ్‌షోకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. డప్పు వాయిద్యాలు, మంగళహారతులతో స్వాగతం పలికారు. ఆయా కార్యక్రమాల్లో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


ప్రశాంత్‌రెడ్డి, బాజిరెడ్డికి డప్పువాయిద్యాలతో స్వాగతం పలుకుతున్న దూదిగాం గ్రామస్తులు

గులాబీ జోష్

కేసీఆర్ బస్సుయాత్ర సక్సెస్

నిజామాబాద్, మే 8(నమస్తే తెలంగాణ ప్రతినిధి): భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ చేసిన బస్సు యాత్ర గులాబీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని అందించింది. కేసీఆర్ తలపెట్టిన బస్సుయాత్ర దిగ్విజయంగా కొనసాగుతూ ఉమ్మడి జిల్లాను రెండు రోజులపాటు చుట్టేయడంతో శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ రోడ్డు షోకు తండోపతండాలుగా జనం రావడంతోపాటు గులాబీ బాస్‌కు అడుగడుగునా నీరాజనం పలకడంతో బీఆర్ఎస్ క్యాడర్‌లో ఉత్సాహం కనిపిస్తున్నది. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా అలుపెరగని పోరాటం చేస్తున్న కేసీఆర్‌కు ప్రజల మద్దతు విశేషంగా లభించడంతో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల్లో వణుకు మొదలైంది. గులాబీ పార్టీకి గెలుపు అవకాశాలు పెరగడంతో రెండు జాతీయ పార్టీల్లో నైరాశ్యం అలుముకున్నది. రోజురోజుకూ గ్రాఫ్ పడిపోతుండడంతో సరిదిద్దుకోలేక హస్తం, కమలం పార్టీలు తంటాలు పడుతున్నాయి. కేసీఆర్ పర్యటన కారు పార్టీ లోక్‌సభ అభ్యర్థులకు వెయ్యి ఏనుగుల బలాన్ని అందించింది. మే 13న జరిగే పోలింగ్‌కు జనామంతా గులాబీ పార్టీకి మద్దతు తెలిపేందుకు సంసిద్ధం అవుతున్నారు. గులాబీ దళపతి ప్రసంగాన్ని విన్న వారంతా ఆలోచనలో పడ్డారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు ప్రజల స్థితిగతులు అప్పుడెట్లుండే.. ఇప్పుడెట్లుంది..? అనుకుంటూ వాస్తవాలను గ్రహించుకుంటున్నారు.

జనం హోరు.. బీఆర్ఎస్ జోరు..

నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గం వైవిధ్యతను సంతరించుకున్నది. ఈ ప్రాంతం బీఆర్ఎస్ పార్టీకి పెట్టనికోట. టీఆర్ఎస్ ఆవిర్భవించిన తొలినాళ్లలో స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాలంతా ఏకపక్షంగా మద్దతు అందించి జడ్పీ పీఠాన్ని గెలిపించారు. సమైక్య పాలకులకు ముచ్చెమటలు తెప్పించి విలక్షణమైన తీర్పును అందించారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లోనూ అదే తీర్పు ప్రస్ఫుటంగా కనిపించబోతుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. 2014లో బీఆర్ఎస్ అభ్యర్థిగా కల్వకుంట్ల కవిత పోటీ చేసి దిగ్విజయమైన విజయాన్ని అందుకున్నారు. తదనంతరం 2019లో అబద్ధపు హామీలు, ఐదు రోజుల్లోనే పసుపు బోర్డు ఏర్పాటు అంశాన్ని తెరమీదికి తీసుకువచ్చి అసత్యాలను ప్రచారం చేసి పసుపు రైతులను నట్టేట ముంచి ధర్మపురి అర్వింద్ విజయం సాధించారు. ఇప్పుడు వాస్తవాలను ప్రజలంతా గ్రహించారు. దీంతో బీజేపీ ఎంపీకి ప్రస్తుతం గడ్డుకాలం కొనసాగుతున్నది. ప్రచారంలో పలుచోట్ల నిరసనలు, అడ్డగింతలు సైతం ఎదురవుతున్నాయి. సిట్టింగ్ ఎంపీపై బీజేపీలోనే తీవ్రమైన ఆగ్రహావేశాలు రగులుతుండగా అర్వింద్‌ను బాహాటంగానే వ్యతిరేకిస్తున్నారు. కేసీఆర్ బస్సు యాత్ర అనంతరం జనాల్లో మైలేజ్ పెరగడంతో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులంతా రెట్టించిన ఉత్సాహంతో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. మే 11వరకు ఎన్నికల ప్రచారానికి అవకాశం ఉండడంతో పెద్ద ఎత్తున జనాల్లోకి వెళ్లి వారి ఆశీస్సులను పొంది బాజిరెడ్డి గోవర్ధన్ భారీ మెజార్టీతో విజయాన్ని సాధించేందుకు కృషి చేస్తున్నారు.



కామారెడ్డిలోనూ కారు హవా..

జహీరాబాద్ లోక్‌సభ పరిధిలోని కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించిన కేసీఆర్ బస్సుయాత్ర, రోడ్డు షోలకు విశేష ఆదరణ లభించడంతో గులాబీ పార్టీలో ఉత్సాహం పెరిగింది. కాంగ్రెస్, బీజేపీల కన్నా ప్రచారంలో ఎంతో ముందున్న బీఆర్ఎస్ పార్టీకి అధినేత టూర్ మరింత కలిసి వచ్చినట్లైంది. గాలి అనిల్ కుమార్ అలుపెరగని ప్రచారంతో జనాల్లోకి దూసుకుపోతున్నారు. సిట్టింగ్ ఎంపీ బీబీపాటిల్ అవకాశవాద రాజకీయాలను జనాలంతా ఛీ కొడుతున్నారు. పలుచోట్ల ప్రజలు నిరసనలు వ్యక్తం చేస్తుండగా, మరికొన్ని చోట్ల నిలదీస్తున్నారు. పదేండ్లలో చేసిందేమిటి? అం టూ ప్రశ్నిస్తున్నారు. గతంలో ఎంపీగా పని చేసిన సురేశ్ షెట్కార్ మరోసారి కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తుండడంతో ఈయనకు అదే పరిస్థితి ఏర్పడుతున్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో నెలకొన్న గడ్డు పరిస్థితులకు సమాధానం చెప్పలేక హస్తం పార్టీ అభ్యర్థి ముఖం చాటేస్తుండడం కనిపిస్తున్నది. కామారెడ్డిలో నిర్వహించిన కేసీఆర్ టూర్ దిగ్విజయంతో శ్రేణుల్లో మరింత ఆత్మవిశ్వాసం పెరిగింది. భారీ మెజార్టీతో గెలుపే లక్ష్యంగా పని చేసేందుకు రెడీ అవుతున్నారు. కేసీఆర్ టూర్‌కు తరలి వచ్చిన జనాలను చూసి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నేతలంతా ఖంగుతింటున్నారు. మొత్తానికి నిజామాబాద్, జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల్లో మూడు రోజుల పాటు నిర్వహించిన కేసీఆర్ బస్సు యాత్ర అనుకూల ఫలితాలను రాబట్టేందుకు మంచి రాచబాటను ఏర్పర్చినట్లుగా అయ్యింది.

అక్రమ కేసులకు భయపడం

మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి

బీఆర్ఎస్ నాయకులను పరామర్శిస్తున్న మాజీ స్పీకర్ పోచారం

వర్ని, మే 8: బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై కాంగ్రెసోళ్లు అక్రమ కేసులు బనాయిస్తే భయపడేదిలేదని, కార్యకర్తలకు అండగా ఉంటామని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి అన్నారు. మండలంలోని శ్రీనగర్ మాజీ సర్పంచ్ రాజుతోపాటు పలువురు యువకులపై అక్ర మ కేసులు బనాయించిన విషయం తెలుసుకున్న ఆయన బుధవారం వారి ఇంటికి వెళ్లి మాట్లాడారు. కేసు వివరాలు తెలుసుకొని వారికి ధైర్యం చెప్పారు. ఇటీవల గ్రామంలో జరిగిన చిన్నపాటి ఘర్షణలో ఘటనాస్థలంలో లేని మాజీ సర్పంచ్ రాజుపై కేసు నమోదు చేయడం కాంగ్రెస్ నాయకుల నీచ రాజకీయాలకు నిదర్శనమని అన్నారు. కేసుల పేరిట భయభ్రాంతులకు గురిచేసి నాయకులు, కార్యకర్తలను పార్టీలో చేర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఎల్లారెడ్డిలో చేసినట్లు ఇక్కడ కూడా చేస్తామంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు కల్లాలి గిరి, వెలగపూడి గోపాల్ తదితరులు ఉన్నారు.

పదేండ్ల పాలనలో మోదీ ఇచ్చింది గాడిద గుడ్డే..

- బీజేపీ సర్కార్‌కు వాతపెట్టి బొందపెడతాం
- ఆరడుగుల అర్వింద్ అహంకారి
- సీఎం రేవంత్‌రెడ్డి

మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

కంఠేశ్వర్/ఆర్మూర్, మే 8: పదేండ్ల పాలనలో కేంద్రంలోని బీజేపీ, ప్రధాని మోదీ తెలంగాణకు ఇచ్చింది గాడిద గుడ్డేనని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఆర్మూర్, నిజామాబాద్‌లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతూ బీజేపీ ఎంపీ అర్వింద్ పసుపు బోర్డు తెస్తానని చెప్పి మాట తప్పాడన్నారు. ప్రధానిగా మోదీ పదేండ్లు ఉండి, ఎంపీగా అర్వింద్ ఐదేండ్లు ఉండి నిజామాబాద్‌కు స్మార్ట్‌సిటీ తీసుకురాలేదని విమర్శించారు. చెరుకు రైతులకు మద్దతు ధర తీసుకురాలేదన్నారు. అర్వింద్ మీడియాతో మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని మారుస్తానని అంటున్నారని, అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చేందుకు మీరు ఎవ్వరని, ఆ హక్కు మీకెవరు ఇచ్చారని ప్రశ్నించారు. మోదీ 2020 సంవత్సరంలో జనాభా లెక్కలు, బీసీ కులగణన ఎందుకు చేపట్టలేదని అన్నారు. బీసీ, ఎస్సీ రిజర్వేషన్లు రద్దు చేస్తామంటున్న బీజేపీని ప్రభుత్వంలో లేకుండా చేస్తామన్నారు. రిజర్వేషన్లను కాపాడుకోవాలంటే బీజేపీని ఓడించాలని అన్నారు. పసుపు బోర్డు అడిగితే గాడిద గుడ్డు ఇచ్చారని విమర్శించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, లోక్‌సభ అభ్యర్థి జీవన్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

తమాషాలు చేయడానికే రేవంత్ రెడ్డి ప్రచారానికి వస్తుండు..

- పీఎఫ్ఐ, సిమికి అడ్డా జగిత్యాల
- టెర్రరిస్టులకు కాంగ్రెస్ మాతృ సంస్థ
- ఎంపీ అర్వింద్ వ్యాఖ్యలు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అర్వింద్

వినాయక్‌నగర్, మే 8: నిజామాబాద్‌లో తమాషాలు చేయడానికి రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారానికి వస్తున్నాడా? అని ఎంపీ ధర్మపురి అర్వింద్ ప్రశ్నించారు. ఉగ్రవాద సంస్థలు కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా ప్రచారం చేస్తున్నాయని, ఎన్నికల్లో ఫండింగ్ చేస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్‌కు ముస్లింలు మద్దతు ఇవ్వాలని స్టూడెంట్ ఇస్లామిక్ మూమెంట్ ఆఫ్ ఇండియా (సిమి), పీఎఫ్ఐ వంటి నిషేధిత సంస్థలు తీర్మానం చేయడం దారుణమన్నారు. నిజామాబాద్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో అర్వింద్ బుధవారం విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. టెర్రరిస్టు ఆర్గనైజేషన్లకు కాంగ్రెస్ పార్టీ మాతృ సంస్థ అని ఆరోపించారు. దేశ సంపద మీద మొదటి హక్కు మైనార్టీలకేనని గత ప్రధాని మన్మోహన్‌సింగ్ అన్నారని గుర్తు చేశారు. అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్న సిమి లాంటి సంస్థలు కాంగ్రెస్‌కు ఫండింగ్ చేయడంతో పాటు నేరుగా మద్దతు ప్రకటిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇస్తే ఇలాంటి టెర్రరిస్టు సంస్థల చేతుల్లో అధికారం కేంద్రీకృతం అవుతుందని తెలిపారు. నిషేధిత సంస్థలు చేసిన తీర్మానాలను కరపత్రాల రూపంలో ముద్రించి మైనార్టీల ఏరియాల్లో పంచి పెడుతున్నారని ఆరోపించారు. జగిత్యాల పీఎఫ్ఐ వంటి సంస్థలకు అడ్డాగా మారిందన్నారు.

ఉమ్మడి జిల్లాలో వర్షం

ఈదురుగాలులకు ఎగిరిపోయిన పైకప్పులు

నేలకూలిన చెట్లు.. విద్యుత్ సరఫరాకు అంతరాయం

కామారెడ్డి/బీబీపేట్/దోమకొండ/కోటగిరి , మే 8: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుంచే ఉక్కపోతగా ఉన్న వాతావరణం సాయంత్రం ఒక్కసారిగా దట్టమైన మబ్బులు కమ్ముకున్నాయి. కామారెడ్డి జిల్లాలోని బీబీపేట, దోమకొండ, నిజామాబాద్ జిల్లాలోని కోటగిరి మండలాల్లో ఈదురుగాలుల ధాటికి నష్టం సంభవించింది. దోమకొండ మండల కేంద్రంలోని శివరాం మందిర్ ఆలయంలో రథాలను ఉంచే స్థలంలో పైకప్పు రేకులు కిందపడ్డాయి. పోతంగల్ చెక్‌పోస్టు వద్ద ఉన్న ఓ భవనం అద్దాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. దీంతో రూ.5లక్షల మేర నష్టం వాటిల్లినట్లు యజమాని నాగయ్య తెలిపారు. పలుచోట్ల చెట్లు నేలకూలాయి. వర్షంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కామారెడ్డి జిల్లా కేంద్రంలో చిరుజల్లులు కురిశాయి. దీంతో ఆకాశంలో ఏర్పడిన ఇంద్ర ధనస్సు చూపరులను ఆకట్టుకున్నది.

దోమకొండలోని శివరాం మందిర్ వద్ద కుప్పకూలిన రేకుల షెడ్డు

వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి

సావిత్రి (ఫైల్)

నందిపేట్, మే 8: వెల్మల్ గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీ గుండెం సావిత్రి (54) వడదెబ్బతో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. రోజూ ఉపాధి పనుల్లోకి వెళ్తున్న సావిత్రి నాలుగు రోజుల క్రితం వడదెబ్బతో తీవ్ర అస్వస్థతకు గురైంది. దీంతో జిల్లా దవాఖానలో చేర్పించారు. చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. ఇందులో భాగంగా నిజామాబాద్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, గణేశ్‌గుప్తా బుధవారం ప్రచారం చేశారు.